# తండ్రి గారి సందేశం....



## యేసు ప్రభువు నిజమైన దేవుడు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

మనం దేవుని కుమారుడైన యేసు ప్రభు భూలోకంలో జన్మించాడని విశ్వసిస్తున్నాం. కొద్ది రోజుల క్రితమే ఆయన జన్మదినాన్ని జరుపుకున్నాం. యేసు ప్రభువు మానవునిగా జన్మించాడు కానీ, ఆయన దేవుని కుమారుడని, స్వయంగా దేవుడని మనం విశ్వసిస్తున్నాం. కానీ, చాలా మంది యేసు ప్రభువు దేవుడు కాదని ఆయన కేవలం మానవ మాత్రుడని చెబుతుంటారు. యేసు ప్రభు మంచి మనిషి, బోధకుడని, కేవలం ప్రవక్త అని, సంఘ సంస్కర్త అని చెప్పేవారు కూడా ఉన్నారు. యేసు దేవుడని అంగీకరించటం ఇష్టపడని వారు కూడా ఉన్నారు. అందుకు వారు చెప్పే కారణం–"యేసు తను దేవుడనని ఎక్కడా చెప్పుకోలేదు" అని అంటారు. కానీ పరిశుద్ధ గ్రంథాన్ని లోతుగా పరిశీలిస్తే అది నిజం కాదు అని మనకు అర్థమవుతుంది.

యేసు యూదుడుగా జన్మించాడు. ఆయన ప్రజ్ఞా సామర్థ్యము, పాండిత్యము, జీవితము, కార్యకలాపాలు అనన్య సామన్యము. నీకొదేము కూడా ఆయనను "బోధకుడా (రబ్బీ), నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేము ఎరుగుదుము. ఏలయన, దేవుని సహకారము లేని యెడల నీవు చేయుచున్న అద్భుతకార్యములు ఎవడును చేయలేడు" అని పలికెను (యోహాను 3,2). ప్రభువైన యేసుకు తోరా (ఆదికాండము నుండి ద్వితీయోపదేశ కాండము) తెలుసు. పరిశద్ధ లేఖనాలను ఆయన బాగుగా ఎరుగును. యేసు తన దైవత్వానికి రుజువుగా లేఖనాలను ఉపయోగించినప్పుడు, ఆయన సందేశాన్ని ఆనాటి ప్రజలు అంగీకరించలేకపోయారు. వారు నివ్వెర పోయారు, కోపంతో మండిపడ్డారు. తాను దేవుడనని ఆయన చెప్పుకున్నట్టు వారికర్థమైంది.

మోషేకు బయలుపరచబడిన దేవుని నామాన్ని యూదులు ఎంత భక్తి గౌరవాలతో జాగ్రత్తపరచారంటే, కనీసం వారు దానిని ఉచ్చరించడానికి కూడా భయపడేవారు. యావే అని ఉచ్చరింప శక్యము కాని నామానికి బదులు "ప్రభువు" (అదోనాయ్) అని వారు పలికేవారు. దేవుడు మోషేకు బయలుపరచిన నామము యెహోవా, "ఉన్నవాడు" (ఆంగ్లంలో I AM) అనే క్రియావాచకం యొక్క రూపమది. మరో విధంగా చెప్పాలంటే, మోషేకు దేవుడు తన్ను బయలు పరచుకున్నది "నేనే" (I AM) అని.

ఈ నామాన్ని యేసు ప్రభువు తనకు వర్తింపజేసికొన్నప్పుడు యూదులకు వచ్చిన కోపాన్ని రౌద్రాన్ని మనం అర్థం చేసికొనడం కష్టమౌతుంది. "అబ్రహాము జన్మించుటకు పూర్వమే **నేను** (I AM) ఉన్నాను అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను". అని యేసు పలికెను. అందువలన వారు ఆయనపై రాళ్ళు రువ్వ పూనుకొనిరి (యోహాను 8,58-59). ఇదే అత్యున్నతమైన నిరూపణ. యూదులు మాత్రం ఆయనను నమ్మలేదు. ఆయన చెప్పుకొన్నది దేవదూషణగా వారు భావించారు. దేవదూషణ రాళ్లతో కొట్టి చంపబడే దోషమైనందున (లేవీ 24,16) రోమా చట్టం క్రింద అనుమతిలేని అల్లరి మూక యొక్క కార్యంగా చేయ వారు ప్రయత్నించారు (యోహాను 18,31).

**"నేనే"** అనే సూత్రాన్ని ఈ విధంగా మాట్లాడడం దైవత్వానికి తగియున్నట్టు కన్పిస్తుంది. "ఇది యేసు తన్ను గూర్చి తాను బహు ధైర్యంగా చేసిన ప్రతిపాదన– **'నేనే'.** నేనెక్కడ ఉందునో అక్కడ దేవుడున్నాడు, అక్కడ దేవుడు నివసిస్తాడు, పిలుస్తాడు, మాట్లాడతాడు, క్రియ జరిగిస్తాడు, నిర్ణయిస్తాడు, ప్రేమిస్తాడు అని దాని భావం.

"నేనే" అనే ప్రతిపాదన ప్రాథమికంగా దైవత్వాన్ని సూచిస్తుంది. (ఉదా॥ యెషయా 41,4). ఇది మనస్సులో ఉంచుకుంటే, ప్రభువైన యేసు జీవితంలోని అనేక ప్రతిపాదనలు ప్రత్యేకమైన ప్రాధాన్యత కలిగినవై ఉ ంటాయి. కొన్ని ఉదాహరణలను గమనించండి. ''జీవాహారమును **నేనే**'', **''నేను** లోకమునకు వెలుగై యున్నాను," "గొర్రెలు పోవు ద్వారమును **నేనే,"** **"నేను** గొర్రెల మంచి కాపరిని," "పునరుత్థానమును **నేనే,"** **"నేనే** మార్గమును సత్యమును జీవమును," **నేనే** నిజమైన ద్రాక్షావల్లిని" (యోహాను 6,35; 8,12; 10,7-11; 11,25; 14,6; 15,1).

యేసు ప్రభు తనను దేవుని కుమారుడునని చెప్పుకున్నాడని యూదులు భావించినందు చేతనే వారు ఆయనను ద్వేషించారు. ఆయనను చంపటానికి ప్రయత్నించారు. "ఇది వినిన యూదులు ఆయనను చంపుటకు ఇంకను ఎక్కువగా ప్రయత్నించిరి. ఏలయన, ఆయన విశ్రాంతి దిన నియమమును మీరుటయే కాక, దేవుడు తన తండ్రి అని చెప్పుచు తన్ను దేవునికి సమానముగ చేసికొనుచుండెనని వారు భావించిరి" (యోహాను 5,18). యేసు "అబ్రహాము జన్మించుటకు పూర్వమే నేను ఉన్నాను అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని పలికెను. అందువలన వారు ఆయనపై రాళ్లురువ్వ పూనుకొనిరి. (యోహాను 8,58-59).

ఈ మాటలు రెండు విషయాలను మనకు తెలియజేస్తున్నాయి.

1. యేసు ప్రభువు అనాది కాలం నుండి ఉన్నవాడు.
2. యావే తన నామాన్ని బయలు పరచడానికి ఉపయోగించిన "నేనే" (ఆంగ్లములో I AM) అనే పదాన్ని యేసు ప్రభు తన కొరకు కూడా ఉపయోగించాడు.

ఒక సారి ఈ మాటలను గమనించండి

"ఈ కార్యమును నిర్వహించిన దెవడు? ఆది నుండి తరతరాల ప్రజలను సృజించిన దెవడు? ప్రభువునైన నేనే. ప్రథమమున ఉన్న వాడను నేనే. కడపటన ఉందు వాడను నేనే" (యెషయా 41,4). ఇస్రాయేలు రాజును వారి విమోచకుడును సర్వశక్తిమంతుడైన ప్రభువు ఇట్లనుచున్నాడు. "మొదటి వాడను కడపటి వాడను నేనే. నేను తప్ప వేరొక దేవుడు లేడు" (యెషయా 44,6). "యాకోబు! నేను పిలిచిన యిస్రాయేలూ! నా పలుకు లాలింపుము. నేను ప్రభువును, మొదటి వాడను, కడపటి వాడను గూడ (యెషయా 48,12).

యావే దేవుడు తనను గురించి "నేనే మొదటి వాడను, కడపటి వాడను" అని అన్నాడు. యేసు ప్రభు కూడా ఇవే మాటలను తన గురించి పలుకుతున్నాడు. "నేను ఆయనను చూచిన తోడనే మృతిని వలె ఆయన పాదముల ముందట పడితిని. ఆయన తన కుడి చేతిని నాపై ఉంచి యిట్లనెను. ''భయపడకుము. ఆది, అంతము నేనే" (దర్శన 1,17). "నేనే ఆల్ఫా, ఓమేగ, నేనే మొదటి వాడను, కడపటి వాడను, నేనే ఆదియును అంతమునై ఉన్నాను అని పలికెను" (దర్శన 22,13).

పునీత పౌలు గారు యేసు ప్రభు దైవత్వాన్ని గురించి వివరిస్తున్నారు. "క్రీస్తు యేసు నందు మీదైన ఈ మనస్తత్వమును మీ మధ్య ఉండనిండు. ఆయన ఎల్లప్పుడును దైవ స్వభావమును కలిగి ఉన్నను, దేవునితో తన సమానత్వమును గణింపలేదు. ఇది గ్రహింపవలసిన విషయము. కాని ఆయన తన్నుతాను రిక్తుని చేసికొని సేవక రూపమును దాల్చి మానవ మాత్రుడుగా జన్మించెను" (ఫిలిప్పీ 2,5-7)

యేసు దైవత్వాన్ని వివరించే మరి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

"తండ్రి ఎవనికిని తీర్పు విధింపడు. తీర్పు విధించు సర్వాధికారము కుమారునకు ఇచ్చెను. అందరు తండ్రిని గౌరవించినట్లే కుమారుని కూడ గౌరవించుటకు ఆయన అట్లు చేసెను. కుమారుని గౌరవింపనివాడు ఆయనను పంపిన తండ్రిని కూడ గౌరవింపడు" (యోహాను 5,22-23). "ఏలయన, తండ్రి తనంతట తాను జీవము కలిగియున్నట్లే కుమారుడు కూడ తనంతట తాను జీవము కలిగియుండునట్లు చేసెను" (యోహాను 5,26).

"వానిని నా కిచ్చిన నా తండ్రి అందరి కంటె గొప్పవాడు. కనుక, వానిని నా తండ్రి చేతి నుండి ఎవడును అపహరింపలేడు. ''నేనును, నా తండ్రియు ఏకమైయున్నాము'' అని చెప్పెను (యోహాను 10,29-30). "కాని నేను వానిని నెరవేర్చుచున్న యెడల, మీరు నన్ను నమ్మకపోయినను, నా పనులనైనను నమ్ముడు. తండ్రి నా యందును, నేను తండ్రి యందును ఉన్నామని మీరు గ్రహింతురు" (యోహాను 10,38). ''యేసు వారితో ''మీ హృదయమును కలవర పడనీయకుడు. దేవుని విశ్వసింపుడు. నన్నును విశ్వసింపుడు" (యోహాను 14,1). ''మీరు నన్ను ఎరిగియున్నచో, నా తండ్రిని కూడా ఎరిగి యుందురు. ఇక నుండి మీరు ఆయనను ఎరుగుదురు. మీరు ఆయనను చూచి ఉన్నారు అని పలికెను" (యోహాను 14,7). "తండ్రి కుమారుని యందు మహిమ పరుప బడుటకు మీరు నా పేరిట ఏమి అడిగినను చేసెదను. మీరు నా పేరిట నన్ను ఏమి అడిగినను దానిని చేసెదను" (యోహాను 14,13-14). ''నిన్నను, నేడును, ఎల్లప్పుడును, యేసు క్రీస్తు ఒకే రీతిగ ఉండును" (హెబ్రీ 13,8).

ఈ విధంగా క్రొత్త నిబంధన యేసు ప్రభు దైవత్వాన్ని రుజువు చేస్తుంది. ప్రియ సహోదరీ, సహోదరులారా! మనం యేసు ప్రభువును దేవునిగా అంగీకరించి ఆయనను ఆరాదిద్దాం, ఆయన బాటలో నడుద్దాం. ఆయనే మన రక్షకుడు, మనలను నిత్యజీవానికి చేర్చేవాడు. యేసు ప్రభునందు విశ్వాసముంచి ముందుకు సాగుదాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు
మరియు
ఆదిలాబాద్ గురుపీఠంలో
సువార్త వ్యాప్తి కొరకు మేము
నిర్మిస్తున్న ధ్యానకేంద్రాన్ని
ఆశీర్వదించండి. ఎటువంటి
ఆటంకములు లేకుండా దానిని
సకాలంలో పూర్తి చేయుటకు
తద్వారా మీ సువార్తను
ప్రకటించుటకు మాకు అనుగ్రహం
దయచేయమని ప్రార్థించుచున్నాము.
ఆమెన్.

